# కాగితం పడవ

వాన కురిసి వెలిసిన రోజున ఇరుగు పొరుగు పిల్లలంతా కాగితం పడవలు వదుల్తూ కేరింతలు కొడుతూవుంటే ఆ తల్లి హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. అయితే అది క్షణికం. ఆ పిల్లల వాదులాటలు ఆమె ఆనందానికి అంత రాయం కలిగించాయి. అందుకు కారణం లేకపోలేదు....

చాలా పెద్ద వాన కురిసింది. వెలిసింది. కాని, యింకా వున్నాను సుమా అన్నట్లు తుప్పరగా రాలుతున్నది. రోడ్లన్నీ జలమయమైపోయాయి. చూరునించి నీళ్ళు ధారగా కారు తున్నాయి. మనుషులు ఆ గుమ్మంలోను, ఈ పంచలోను తల దాచుకున్న వాళ్ళు తెగించి, తప్పనిసరి గనుక రోడ్లమీదకు దిగి పోతున్నారు. శకుంతల దీపాలవేళకింకా గంట వ్యవధి వున్నా లాంతరు చిమ్నీ తుడిచి, దాన్లో చమురు పోసి, వెలి గించి అంతలో ఏదో జ్ఞాపకం వచ్చినదాన్లా నట్టింట్లోంచి వరండాలోకి వచ్చింది. వస్తూనే "పాపం! ఆయన పూర్తిగా తడిసిపోయొస్తారు కాబోలు! రేపటికి చాకింటి బట్టలుకూడా లేవు" అనుకుంది. కాని, ఆమె చూపంతా ఆరేళ్ళ రాధకోసం గుమ్మంలోనే వుంది.

రాధకి వాన కురియడం, వెలిసిపోవడం రెండూ పరమానందంగా వున్నాయి. అదీ, ఎదురింటి మోహన్, యిరుగింటి రాజా, పొరుగింటి బాబ్జీ అంతా సంబరంగా కేరింతలాడుతున్నారు. చూరునించి నీళ్ళు కారి తడిసిపోతున్నామని గాని, నేలకూచుని నీళ్ళల్లో పడవలువేస్తోవుంటే వెనకాతల గౌనులు, చొక్కాలు నీళ్ళు తాగేస్తున్నాయని గాని జ్ఞానమే లేదా పిల్లలకి!

"రాధా! ఒసేవ్!. అమ్మలూ! నిన్నేనే!" శకుంతల కేకలకి రాధ పలకలేదు. అసలు వాళ్ళీ ప్రపంచంలోనే లేరు. వాననీళ్ళు కాలవలనిండా 'లోడా లోడా' పారుతూంటే, అదేదో, తమ ప్రజ్ఞలాగే వుంది. వాళ్ళకి, శకుంతలకి పిల్లల ఆనందానికి అడ్డుపడాలనిపించలేదు. "తడిస్తే ముక్కులంట నీళ్ళు కార్తాయి. ఇంత మిరియంవేసి చారు కాసేస్తారేపు" అనుకుంది. "అదీగాక అవతల గోరుచిక్కుడుకాయ లేరుకోవాలి. రాధను ఇప్పుడు కదిపితే అది నా చెవులు పట్టుకుని వూపుతుంది" అనుకుంటూ లోపలికి వెళ్ళి చిక్కుడుకాయ లేరుకుంటోంది శకుంతల.

రాజా కత్తిపడవ చేశాడు. రాధపడవ కాస్సేపు చక్కగానే వెళ్ళింది. గాని, రాజా కత్తిపడవ దాన్ని చిన్నగా తాకింది, అదికాస్తా కాలవ అంచుకు తాకింది. నానిపోయింది, బద్దుకు పోయింది. "హాయ్! హాయ్! హాయ్! రాధాయ్! నీ పడవాయ్! నా పడవతో ఠార్! నాది కత్తిపడవోయ్!"

అంటూ రాజు "వానా వానా చెల్లప్పా" తిరిగేస్తున్నాడు. రాధకి ఉడుకుమోత్తనం మహాయిదిగా వచ్చేసింది. కోపంతో రాజుని ఒక్క చెంపదెబ్బ వేద్దామనుకుంది గాని....తన పడవ? తన పడవ మునిగిపోయిందిగా...మరో పడవకోసం కాగితం ముక్క మడిచింది. బాబ్జీ అదిచూసి "రాధీ! కత్తిపడవ చెయ్యి! రాజుగాడి పడవకి ఢీ యిద్దాం" అన్నాడు.

"నాకు రాదురా!" రాధ బిక్కమొహం వేసింది."

"పోనీలే! రాజుగాడి జట్టు విప్పేయ్! మనం పోయి చూరుకింది నీళ్ళు పట్టుకునే ఆటాడుకొందాం!" బాబ్జీ సలహా ఇచ్చాడు.

"ఊహూఁ"

"మరి? నీకా రాజుగాడంటే ఇష్టం. అందుకే వాడలా ఏడిపిస్తాడు ఏడూ ఫో" బాబ్జీ పారిపోయాడు.

రాధకి కత్తిపడవ కావాలి. ఎలాగ? రాజుని ఓడించాలి, వుడికించాలి, ఏడిపించాలి! రాజుని వదిలి పోవడం దానికి పిసరు యిష్టంలేదు.

"అమ్మ వుందిగా...అమ్మనడుగుతా" ఆ వూహ తట్టడమే తడవుగా చెంగున లేచి పారిపోయింది యింట్లోకి రాధ.

రాధ పరిగెత్తుకుని వచ్చి "అమ్మా! అమ్మా! నాక్కావాలే నాక్కావాలే" అంటూ తల్లి వీపుమీద కెక్కి పోయింది.

„ఏయ్ మొద్దూ! ఏమిటదీ? ఇల్లంతా తొక్కుతున్నావ్! లే! ఊఁ ఏంకావాలి? రా, ఇలావచ్చి కూచో. కాస్త నాకు ఈ కాయలు ఏరి సాయం చెయ్యి. నాన్నా రొచ్చే వేళయింది!" అంటోనే శకుంతల రాధ చిన్నారి చేతులను తన మెడకు హత్తుకుంది. అవి తీసి ముద్దెట్టుకుంది.

„నాక్కాయితం కత్తిపడవ కావాలి!" రాధ ముందుకి వచ్చి గునిసింది.

„ఘోయి నిన్నటి పేపరు నాన్నారి బల్లమీద ఎడంచేతికేసి వుంది తే!"

రాధ క్షణంలో తెచ్చింది.

శకుంతల కాగితం మడిచింది.

„అదికాదే, కత్తిపడవే? పే...ద్దదే...మరేమో...."

„అబ్బా! ఉండవే! అదే చేస్తున్నానూ"

రాధకి రాజా పడవను ముంచాలి, రాజా పొగరణచాలి. అదే ఆదుర్దా...దానికి కాలు నిలవడమే లేదు.

కత్తిపడవ అవగానే తీసుకుని పారిపోయింది తుర్రున.

* * *

శకుంతల, కూతురు పారిపోయినవేపు రెండు క్షణాలు చూసి తానుకూడా ఉత్సాహంగా లేచి ఆ వెనకనే గుమ్మంలోకి వెళ్ళింది.

రాధ అర్జంట్‌గా కత్తిపడవ కాలవలో వేసింది. కాని రాజా ఏడి?

"ప్రత్యర్థి లేకుండా గోదాలోపల దిగి ఏం లాభం?" నిరుత్సాహపడిపోయింది రాధ. అంతలో రాజా రివ్వున వచ్చాడు!

"రాధాయ్! ఇదుగో నీకే ఈ కత్తిపడవ!" వాడు కష్టపడి వాళ్ళన్నయ్య డ్రాయింగ్ పుస్తకం చింపి తెచ్చిన కత్తిపడవ నిచ్చాడు.

"నాది చూడు...ఎంచక్కా వుందో! ఛీ! నీదేం గాదు. మా అమ్మ ఇంత మంచిగా చేసింది" గర్వంగా తన పడవను చూపించింది రాధ.

రాజాకి ఏడుపే వచ్చింది.

"అయితే ఈ పడవ వొద్దా!" అక్కసుగా అడిగాడు.

"ఊహూఁ"

"వొద్దా....వొద్దా....పారేయనా? చింపేయనా?"

"నీ యిష్టం. కావాలంటే దాచుకో! నాకు మా నాన్నారి పేపర్లెన్ని వున్నాయో! మా అమ్మ బోలెడు కత్తిపడవలు చేస్తుంది...." రాధ అటు తిరిగి కూర్చుంది పాదాల మీద.

రాజాకి ఏం చేయాలో రెండు నిముషాలు పాలుపోలేదు.

"సరే! వెధవ పడవకేం గాని....నేను నిజంగా పెద్దవాడినై విమానం నడుపుతా తెలుసా?"

"అబద్ధాలు" అంది వెంటనే యిటుతిరిగి రాధ.

కాదు. మా నాన్నార్నడుగు. నాకు అన్నయ్యంత అవగానే కలకత్తా బొంబాయి పంపేసి విమానం నేర్పుతా మన్నారు" రాధకి రాజా నాన్నగారుకూడా అబద్ధమాడతారనిగాని, అబద్ధాలాడే అవసరం ఆయనక్కూడా కలుగుతుందనిగాని తోచలేదు. కాస్త ఆశగా "విమానాలు మనూర్లో వుండగా అక్కడికెందుకూ?" అంది.

మన వూరిమీదుగా ఎళ్ళేవి మంచివికావు. అవి ఇక్కడ ఆగవు" అన్నాడు రాజా.

"అయినా నాకొద్దు. నువ్వు నన్ను బాబ్జీదగ్గర, సుశీ దగ్గర గోలచేశావ్!" అసలు కారణం చెప్పేసింది రాధ.

"అందుకేగా పెద్దవాడినై విమానంలో ఎక్కిస్తాను అనే మాటిస్తున్నాను" రాజా తన కత్తిపడవను రాధకి అందీ అందకుండా పట్టుకున్నాడు.

"అక్కర్లేదు. ఆ పడవ ఇలా ఇయ్యి చింపి పారేస్తా" అంది రాధ.

రాజా ఇచ్చేశాడు. రాధ వెంటనే నలిపే....నలిపేయలేదు. నలిపేద్దామనుకుని మానేసింది. రాజాకి లోన సర్వస్వమూ రాధ చేతుల్లో వుండటమే గాక రాధ పడవను నలిపేస్తే కలిగే చిన్నతనం ఎంత ఎక్కువోకూడా తెలిపే భావం మొహంలోకి వచ్చేసింది.

రాధ ఆ పడవను జాగర్తగా నీళ్ళల్లోకి వదిలేసింది. రాజాకి మొహం వెలిగింది.

"మరీ....నువ్వు విమానం ఎక్కి పెద్ద చదువులికి వెళ తావా?" రాధ అడిగింది రాజా కళ్ళల్లోకి కుతూహలంగా చూస్తూ.

"విమానమే నేను నడుపుతాను గదా! మళ్ళీ బళ్ళోకి ఎందుకూ?" రాజా ప్రశ్న.

"అమ్మ చెప్పింది...మాకో చిన్నాన్న వుండేవాడట! అతను విమానం ఎక్కి పై చదువులకని..." రాధకి ఊరిపేరు జ్ఞాపకం రాలేదు. "పై చదువులకనీ....కనీ....పై చదువుల..." బుర్ర గోక్కుంటోంది. వాళ్ళ చిన్నాన్న ఏవూరెళ్ళాడో మర్చిపోయింది రాధ.

"అబద్ధాలు!" రాజా కొట్టిపారేశాడు.

"ఛో ఛో! నే నబద్ధమాడను. కావాలంటే మా అమ్మ నడుగు. ఆ చిన్నాన్న విమానంలో వెళ్ళి ఒక తెల్లదొరసానిని తెచ్చుకున్నాట్ట!"

"అంటే?" రాజాకి నోరు అంతా విప్పేసినా ఆశ్చర్యం తీరలేదు.

"అంటే...గౌను వేసుకుంటారు పెద్దాళ్ళు. ఇలా ఎత్తుగా జోళ్ళు వేసుకుని నడుస్తారూ."

"ఓహో...ఐతే నేనూ తెచ్చుకుంటా...మీ చిన్నాన్న దేనా మహగొప్ప?" రాజాకి అదేదో చాలా సాహసమైన కార్యమనిపించింది.

శకుంతల యిక వినలేకపోయింది వాళ్ళ మాటలు. "రాధా! ఇలా రా!" అరిచింది గట్టిగా. ఉలిక్కిపడిపోయింది రాధ. కూతుర్ని దగ్గరికి రాగానే రెక్క పట్టుకుని నట్టింట్లోకి లాక్కెళ్ళి అక్కడ కూచోబెట్టి చేతులో అక్కడే పడివున్న ఎక్కాల పుస్తకం కుక్కి "చదువు ముందు పాజీకానా!" అంది శకుంతల ఆవేశంగా.

రాధ ఏడుపు లంకించుకుంది.

శకుంతలకి కోపం తీరలేదు.

* * *

సరీగ్గా తన ఎనిమిదోఏట రాధకి ఇవాళ "చిన్నాన్న"గా తను చెప్తే తెలిసిన శంకరంకూడా శకుంతలతో ఒక వాన కురిసి వెనసిన రోజున—యిలాగే కాగితం పడవలాట ఆడాడు. శంకరంబావ అంటే శకుంతలకు పంచప్రాణాలూను. శంకరం బావ ఆరోక్లాసు చదివేవాడు అప్పుడు.

"నేను నిన్ను విమానంలో లండన్ తీసుకువెళ్తాను శకూ" అన్నాడు శంకరంబావ. శంకరంబావ అలా ఎన్నో సార్లు విమానం ఎక్కిస్తానన్నాడు. శకుంతల నమ్మింది. శకుం తలకి స్కూల్ఫైనలు పరీక్షలన్నీ రాసి యింటికి తిరిగి వచ్చిన తర్వాతకూడా—కలలో శంకరంబావ, తనూ విమానంలో లండన్ వెళ్ళడమే అగుపించింది. అప్పటికి శంకరంబావ విదే శాలకు వెళ్ళడానికి స్కాలర్షిప్పుల వేటలో వున్నాడు.

శకుంతల వాళ్ళ అమ్మా నాన్న మాట ఎలా వున్నా శకుంతలకు మాత్రం శంకరంబావ తనకోసమే విదేశాలకి విమానాలకి ఎగబడుతున్నాడని తోచింది. శంకరంబావతో తను తెగ తిరిగేది. ఎవరేనా ఏమేనా అంటే తిరగబడి కేకలేసి “మా బావ, నా యిష్టం” అనేది. అయితే “ఈడొచ్చిన పిల్లవు, నీకు పెళ్ళిఅవ్వద్దూ?” అన్నవాళ్లూ వుండేవారు గనుక శంకరంతో తను ఆఖరి రోజుల్లో చనువు తగ్గించింది. చివరికి ఒకనాడు శంకరం లండన్ ప్రయాణ సన్నాహాల్లో వుండగా అడిగేసింది కూడా, “బావా! నన్ను విమానం ఎక్కించవా?” అని. “చూద్దాం శకూ! నన్ను వెళ్ళి రానీ!” అన్నాడు బావ.

కాని బావ వెళ్ళి వచ్చాక శకుంతలను మరి చూడనే లేదు. “దొరల పిల్లనుకూడా తీసుకుని వచ్చేశాడు. శకుంతలకి తల తీసినట్లయింది. శంకరాన్ని చంపి తాను చచ్చిపోదామనుకుంది. కాని, ఏమీ చెయ్యలేదు. అమ్మా నాన్నా సంబంధాలు వెతుకుతూ వుంటే వూరుకుంది.

చివరికి తల్లితో అన్నదికూడా “అమ్మా! నాకు విమానం ఎక్కాలనుందే!” అని.

తల్లి గ్రహించింది. “తల్లీ! ఏ నోము నోచామో అదే వస్తుంది గాని—మనం విమానాలూ అంటే ఎలాగే....విమానాల వాడు నీకు మనసిస్తాడా? వద్దు వద్దు!” అంది.

“కాదే! మరొకరెవ్వరైనా, శంకరంబావ పోగరాగదే!” అన్నది తెగించి శకుంతల.

శకుంతల పట్టుదల, అభిమానం అలాంటి బాధ— శకుంతల కోరినట్లు విమానం కాదుకదా కారెక్కే మొగుణ్ణైనా వెతకలే పోయారు వాళ్ళ అమ్మా నాన్నా సరిగ్గా అలాగే "రాధకూ్కడా కాగితం పడవలు కట్టడం జరక్కూడదు" అనుకుంది శకుంతల పిచ్చిగా—తన అనుభవాన్ని రాధ విషయంలో అన్వయించుకుంటూ.

*     *     *

అంతలో జగన్నాథం సైకిల్ దిగుతూనే "శకుంతలా! రాధ ఎందుకు ఏడుస్తోంది?" అని కేకేశాడు.

శకుంతల ఉలిక్కిపడింది.

రాధ రివ్వున పోయి తండ్రికి ఫిర్యాదు చేసింది. అంతా విని కూతుర్ని ఎత్తుకుని బుజ్జగిస్తూ జగన్నాథం "ఏమయ్యా నేరస్తుడా! ఔనా?" అన్నాడు నవ్వుతూ భార్యను వీక్షించి.

"ఔను! దానికి నాకూ విమానా లెక్కేవాళ్ళెవరొస్తారు? అందుకే ఇప్పట్నించి ఖాయిదా పెడుతున్నా!" నంది శకుంతల అక్కసుగా.

"ఏమో! నా కర్మ కాలి నేను సైకిలెక్కానుగాని, దీనికి మీ శంకరంబావలాంటివాడు రాగూడదా?" అన్నాడు జగన్నాథం కూతుర్ని దింపి—భార్యను ఓరకంట చూసి.

"వద్దు....వద్దు....అది కాగితంపడవలాట ఆడటం... పక్కింటి ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుగారి కుర్రాడితో జట్టు

కట్టడం...సైగా అన్నింటికీ మీతో ఫిర్యాదు చెయ్యడం.... యివేమీ వద్దు...." శకుంతల నవ్వుతూ అన్నది కాని అందులో బాధగూడా వుంది.

జగన్నాథానికి కొంత అర్థం అయింది. కొంత అర్థం కాలేదు. బట్టలు మార్చుకుందుకు ఉపక్రమిస్తూ "సరే! ఏలిన వారి దయ! రాధకిగూడా ఓ నాలాంటి గుమాస్తానే యిమ్మని కోరు నీ దేవుణ్ని!" అన్నాడు.

* * *

## పెళ్ళాంతో షైరేమిటీ?

కోర్కెలు ఎందుక్కలగలీ అంటే ఏం చెబుతాం? అవి కలుగుతాయి. అది వాటి లక్షణం. రావుకి ఆవేళ అర్జంటుగా...ఆఫీసుకి వెళ్ళిపోతున్నప్పుడే - ఆ సాయంకాలం సురేఖను తీసుకుని షైరుకి వెడదామనిపించింది. "అదో, వక్కపొడి డబ్బీలో వుంది. వేసుకు మరీ వెళ్ళండి! ఇవాళ ఆకు స్లైసు" అని భార్య వేసిన కేకకు మారుగా-